తుది దశలో అభివృద్ధి పనులు

- నిరంతరం పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే
- త్వరలోనే మరో రెండు రహదారుల విస్తరణకు శ్రీకారం

మంగళగిరి :నగరంలో కోట్లాది రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయి. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చొరవతో ముమ్మరంగా పనులు కొనసాగుతున్నాయి. నిరంతరం పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే ఈనెల చివరి నాటికి నగరంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు పూర్తి కావాలని అధికారులకు సూచించడంతో పాటు పనుల నాణ్యతా లోపం లేకుండా కొనసాగేలా చూస్తున్నారు. ఇప్పటికే రూ.23 కోట్లతో నగర ప్రధాన రహదారి గౌతమ బుద్ధా రోడ్డు విస్తరణ పూర్తికాగా ఎన్ఆర్ఐ వద్ద మిగిలిన రోడ్డు విస్తరణ పనులను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని సూచించారు.

తెనాలి రోడ్డు విస్తరణకు మార్గం సుగుమం

ప్రధానంగా నగర ప్రధాన రహదారి గౌతమబుద్ధారోడ్డుతో జాతీయరహదారిని కలుపుతూ మరో మూడు రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నారు. వాటిలో భాగవతుల వారి వీధి విస్తరణ పనులు మరో వారం రోజులలో చేపట్టనున్నారు. మరో ప్రధాన రహదారి తెనాలి రోడ్డు విస్తరణకు చేనేత భవనం నిర్మాణంతో మార్గం సుగుమం కానుంది. పాతబస్టాండ్ సెంటర్‌లో రూ.3.90 కోట్లతో చేపట్టిన డాక్టర్ వైఎస్సార్, ప్రగడ కోటయ్య భవనం నిర్మాణం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. చేనేత భవన నిర్మాణం సత్వరమే పూర్తిచేసి తెనాలి రోడ్డులోని చేనేత వస్త్ర దుకాణదారులకు తరలించి తెనాలి రోడ్డు విస్తరణ చేపట్టేలా చూడాలని ఎమ్మెల్యే ఆర్కే అధికారులకు సూచించారు. భాగవతుల వారి వీధి, తెనాలి రోడ్డుతో మరో రోడ్డు జాతీయరహదారిని కలుపుతూ నిర్మాణం చేపట్టేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.



తుది దశకు చేరుకున్న చేనేత భవన నిర్మాణ పనులు



శరవేగంగా కొనసాగుతున్న స్కేటింగ్ ట్రాక్ నిర్మాణం

15నాటికి చేనేత మగ్గం షెడ్ల నిర్మాణాలు పూర్తి

నగరంలోని రాజీవ్ గృహకల్ప కాలనీ వద్ద రూ.2 కోట్లతో చేపట్టిన చేనేత మగ్గం షెడ్ల నిర్మాణాలు ఈ నెల 15వ తేదీ నాటికి పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయాలని ఎమ్మెల్యే ఆర్కే అధికారులకు సూచించారు. ఈ మేరకు అధికారులు నిర్మాణాలను చకచక కొనసాగిస్తున్నారు. మగ్గం షెడ్ల నిర్మాణాలతో 146 మంది నేతన్నలకు సొంత మగ్గాలు అందనుండగా తద్వారా 1200 నేతన్నల కుటుంబాలకు ఉపాధి లభించనుంది. ప్రధానంగా చేనేత పరిశ్రమకు పునరుజ్జీవం కల్పించేలా ఎమ్మెల్యే ఆర్కే చర్యలు చేపట్టడంతో నేతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్రీడలకు నిర్మాణాలు

విజయవాడ, గుంటూరు నగరాల మధ్య రాష్ట్రంలో విశాఖపట్నం అనంతరం రెండో అతి పెద్ద విస్తీర్ణం కలిగిన నగరంగా అవతరించిన మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థను పెద్ద నగరాలకు ధీటుగా అభివృద్ధి పరచేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. నగర ప్రజలకు ఆహ్లాదాన్ని ఆరోగ్యాన్ని అందించేలా ఎయిమ్స్ పక్కన రెండు కొండల మధ్య ఆహ్లాదకర వాతావరణలో టెంపుల్ హిల్ ఏకో పార్కు, ట్రెక్కింగ్ ట్రాక్ నిర్మాణాలు చేయగా యువతకు పిల్లలకు ఆరోగ్యాన్ని ఆహ్లాదంతోపాటు క్రీడలలో రాణించేలా నిర్మాణాలు చేపట్టారు. ఆత్మకూరు గుంటూరు ఛానల్ పక్కన గల తాగునీటి పథకం ఆవరణలో పిల్లలు, యువత కోసం రూ.2 కోట్లతో చేపట్టిన స్కేటింగ్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్ నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయి. అక్కడే కొత్తగా పవర్ లిఫ్టింగ్ స్టేడియం నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నారు. దీంతో పిల్లలు, యువతకు స్కేటింగ్, స్విమ్మింగ్‌లతోపాటు పవర్ లిఫ్టింగ్‌లోను రాణించేలా చర్యలు తీసుకుంటున్నారు.

కొద్ది రోజుల్లో పనులు పూర్తి



నగరంలో ప్రధానంగా జరుగుతున్న అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయి. మరికొన్ని కొనసాగుతున్నాయి. చేనేత మగ్గం షెడ్లు, చేనేత భవనం, స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ ట్రాక్‌ల నిర్మాణాలు తుదిదశకు చేరుకున్నాయి. కొద్ది రోజులలో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. భాగవతుల వారి వీధితోపాటు తెనాలి రోడ్డు విస్తరణ పనులు త్వరలోనే చేపట్టనున్నాం.

–యు.శారదాదేవి, కమిషనర్

ఎమ్మెల్యే ఆర్కే సహాయంతో ఇస్త్రి బండ్లు అందజేత



తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో ఇంటింటికి తిరిగి బట్టలు సేకరించి అద్దె బండిపై ఇస్త్రి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రెండు కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్కే సహకారంతో ఆదివారం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు రెండు బండ్లను అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నాయకులు కత్తిక రాఘవరావు (బుల్లబ్బాయి) మాట్లాడుతూ శంకవరపు సాయితేజ, శంకవరపు సురేష్‌లకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) సహాయంతో బండ్లను అందజేశామని తెలిపారు. వైఎస్సార్ సీపీ వడ్డేశ్వరం కన్వీనర్ గొడవర్తి శ్రీనివాసరావు, అన్నపురెడ్డి రాంబాబు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్యాభినయం

పాత గుంటూరు: ఆర్. అగ్రహారం శివాలయం ప్రాంగణంలో రుద్ర కళాక్షేత్రం నాట్యాచార్య మాచిరాజు రాజేష్ ఆధ్వర్యంలో ఆదివారం గజ్జె పూజ సందర్భంగా విద్యార్థినుల కూచిపూడి నృత్యం ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. ఆలయ ఈవో పగడాల శివకోటేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నటరాజ స్వామి పూజ నిర్వహించారు. విద్యార్థినులు యద్దనపూడి విద్యాసాయి అమృత, కొల్లా కమలాదేవి, పసుపులేటి జాహ్నవి, ఆలపాటి అమృత సాయి, దంపూరి కేధన, కొల్లా వీణావాసవీలు పలు కీర్తనలకు కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు.

క్లుప్తంగా

నేడు హుండీ లెక్కింపు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసియున్న మహంకాళి అమ్మవారి హుండీ లెక్కింపు కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికి చినవెంకటరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి భక్తులు మహంకాళి అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకల హుండీ లెక్కింపు ప్రారంభమవుతుందని, ఆసక్తి గల భక్తులు ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవచ్చని అన్నారు.

కార్మెల్‌మాతకు భక్తుల విశేషపూజలు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండపైనున్న కార్మెల్‌మాతను దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున ఆదివారం తరలివచ్చారు. మార్కాపురం, ధర్మవరం, కారంచేడు, నంద్యాల ప్రాంతాల నుంచి ఉదయాన్నే వాహనాలు, రైళ్లలో భక్తులు తరలివచ్చారు. కొండను ఎక్కి తలనీలాలు సమర్పించి కార్మెల్ మాత వద్ద కొవ్వొత్తులు వెలిగించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కొండ దిగువన ఉన్న కార్మెల్‌మాత వద్ద భక్తులు కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు.

తూటికాడ తొలగించరూ..



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని తాగునీటి చెరువులో తూటికాడ పేరుకుపోయింది. దీంతో తాగునీటి సరఫరా చేస్తున్న నీరు పచ్చగా ఉండటంతో పాటు వాసన వస్తుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. చెరువులో తూటికాడ ఎక్కువగా ఉండటంతో ఆ ప్రాంతమంతా వాసన వస్తుందని, అంతేకాక కొన్ని ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలు పేరుకుపోయి ఉండటంతో నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి చెరువులో తూటికాడను, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.5.4లక్షల వ్యయంతో పైపులైన్ ఏర్పాటు



తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని నులకపేట శివదుర్గాపురంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కార్పొరేషన్ అధికారులు కొత్తగా పైపులైన్ నిర్మాణం చేపట్టారు. ఆదివారం సైతం పైపులైను నిర్మాణ పనులు చకచకా నిర్వహిస్తున్నారు. కార్పొరేషన్ ప్రత్యేక నిధుల నుంచి రూ. 5.4 లక్షలు కేటాయించినట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు. మరో వారం రోజుల్లో ఈ పనులను పూర్తిచేసి నులకపేట ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి శివదుర్గాపురానికి తాగునీటిని అందించనున్నట్లు ఆయన తెలిపారు.

సృజనాత్మకతను పెంచేందుకు శిబిరాలు దోహదం



తాడికొండ: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు వేసవి విజ్ఞాన శిబిరాలు ఎంతోగానే దోహదం చేస్తాయని తుళ్లూరు గ్రంథాలయాధికారి పి.గిరిధర్‌కుమార్ అన్నారు. తుళ్లూరుశాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులతో కథల పుస్తకాలు చదవించడం, క్యారమ్స్, చెస్, ఇతర ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు జములు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీషు క్రియ పదాలు, గ్రామర్ పార్ట్ విద్యార్థులచే చెప్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తుళ్లూరు గ్రామ పరిధిలోని పలువురు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు నగరపాలక సంస్థలో 'స్పందన'

నెహ్రూనగర్: ప్రజల నుంచి స్థానిక సమస్యలపై అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నగరపాలక సంస్థలోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించనున్నట్లు అదనపు కమిషనర్ పెద్ది రోజా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి దృష్ట్యా ఉదయం 8.30 గంటలకే స్పందన రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి రోజు సచివాలయాల్లోనూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన జరుగుతుందని, స్థానికంగా పరిష్కారం కాని సమస్యలపై అక్కడ కూడా ఫిర్యాదులు అందజేయవచ్చని ఆమె సూచించారు.

రహదారుల నిర్మాణానికి శ్రీకారం

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని డోలాస్‌నగర్‌లో రూ.2 కోట్ల వ్యయంతో పలురోడ్ల నిర్మాణానికి అధికారులు ఆదివారం శ్రీకారం చుట్టారు. ఏఈ కిషోర్ మాట్లాడుతూ 40 సంవత్సరాల నుంచి యర్రబాలెం, తాడేపల్లిలను కలుపుతూ ఉన్న రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. స్థానికులు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకురావడంతో ఎంటిఎంసి ప్రత్యేక నిధుల నుంచి రూ.50 లక్షలు కేటాయించి బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టామని, నులకపేట మసీదు వెనుక భాగంలో కొంత రోడ్డు నిర్మాణ పనులు జరక్కపోవడంతో అక్కడ కూడా కార్పొరేషన్ నిధుల నుంచి రూ.60 లక్షలు కేటాయించి రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. మంగళగిరి తాడేపల్లి పాత జాతీయ రహదారి వెంబడి తేజ రెసిడెన్షియల్ వద్ద రూ.40 లక్షల వ్యయంతో సీసీ రోడ్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. శివదుర్గాపురం, నులకపేట తదితర ప్రాంతాల్లో మరో రూ.50 లక్షల వ్యయంతో డ్రెయిన్‌లు, గ్రావెల్ రోడ్ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.



లెవలింగ్ పనులను పరిశీలిస్తున్న ఏఈ కిషోర్

రీ వెరిఫికేషన్ చేసి అనర్హుల పట్టాలు రద్దు చేస్తాం

తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్

మంగళగిరి: ఇళ్ల పట్టాల మంజూరుపై రీ వెరిఫికేషన్ నిర్వహించి అనర్హుల పట్టాలు రద్దు చేస్తామని తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్ చెప్పారు. ఆదివారం యర్రబాలెంకు చెందిన నాగసీత కనకదుర్గ తాను ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలానికి అనర్హురాలని పట్టాను రద్దు చేసి వెనక్కు తీసుకోవాలని తహసీల్దార్‌కు రాత పూర్వకంగా తెలియజేసింది. ఈ నేపథ్యంలో తహసీల్దార్ మాట్లాడుతూ ఇళ్ల స్థలాల మంజూరులో అనర్హులకు పట్టాలు మంజూరై ఉంటే మరోసారి రీ వెరిఫికేషన్ చేసి పట్టా రద్దు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనర్హులను ఎంపిక చేసి తమను తప్పుదోవ పట్టించిన సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్హులందరికీ తప్పనిసరిగా ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తూ అనర్హులను ఎంపిక చేసిన సిబ్బందితోపాటు అనర్హులుగా ఉండి పట్టాలు పొందిన లబ్ధిదారులపైన ప్రభుత్వ నిబంధనల మేరకు చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. అనర్హులు ఇప్పటికే ఎవరైనా ఇళ్ల పట్టాలు పొంది ఉంటే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమకు తెలియజేయాలని కోరారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం

పాత గుంటూరు: లాలాపేటలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రీదేవి, భూదేవీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానం చైర్మన్ పిచ్చల జయప్రకాష్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్, ఈవో డి. శ్రీనివాసరావు, అర్చకులు ప్రసాద్, మురళీ చంద్రకుమార్, శ్రీనివాసచార్యులు నిర్వహణలో సుదర్శన హోమం నిర్వహించారు. సాయంత్రం మేళతాళాలు, బాజాభజంత్రీలతో నగర వీధుల్లో స్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు విశాలక్ష్మి, వెంకట జ్యోతి, నరేష్ కుమార్, రామకోటేశ్వరరావు, వెంకటరత్నం, శ్రీనివాసులు, అనిత, శివకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.



సుదర్శన హోమంలో పాల్గొన్న భక్తులు

ఉత్సాహంగా ఏరువాక



మంగళగిరి మండలం కాజలో జరిగిన ఏరువాకలో ట్రాక్టర్లతో పాల్గొన్న రైతులు



మంగళగిరి మండలం కాజలో జరిగిన ఏరువాక సందర్భంగా కోలాటం ఆడుతున్న చిన్నారులు

ఏరువాక సందర్భంగా ప్రత్యేక పూజలు



తాడేపల్లిరూరల్: ఏరువాక పౌర్ణమి సందర్భంగా మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి ఆదివారం గేటు సెంటర్‌లో గల వినాయకుని గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతుబిడ్డకు ఏరువాక పౌర్ణమి అనేది ఎంతో విశిష్టమైనదని, పౌర్ణమి రోజు తమ ఇష్ట దైవాలను కొలుచుకుని తమ పంటపొలాల్లో అరకలు దున్ని వ్యవసాయ పనులు ప్రారంభిస్తారని, మన ప్రాంతంలో కూడా రైతులు ఏరువాక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అర్చకులు వెంకట భార్గవేశ్వరరావు (ఫణీంద్రరావు) ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కళ్యాణ్, సుబ్బు, కేళి వెంకటేశ్వరరావు, మేకా అంజిరెడ్డి, బాలకోటయ్య పాల్గొన్నారు.

అన్న కొడుకుపై దాడి

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని ఉండవల్లిలో సోదరుల మధ్య ఉన్న ఆస్తి గొడవల్లో అన్న కొడుకుపై దాడిచేసిన సంఘటనపై తాడేపల్లి పోలీసులు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉండవల్లిలో నివాసముండే తాండ్ర కృష్ణ, తాండ్ర కిషోర్‌లు అన్నదమ్ములు. వీరిద్దరి మధ్య ఆస్తి వివాదాలు తలెత్తడంతో కిషోర్ ప్రతిరోజూ కృష్ణ కుటుంబ సభ్యులను దూషిస్తున్నాడు. ఇదే క్రమంలో జరిగిన గొడవలో కిషోర్‌ను కృష్ణ కొడుకు వెంకట దినేష్ దూషించాడు. అక్కడి నుంచి వెళ్లిపోయిన కిషోర్ తిరిగి మరలా వచ్చి కత్తి తీసుకుని వెంకట దినేష్‌పై దాడిచేశాడు. దాడిలో కిషోర్ ఎడమచేతికి గాయమైంది. ఈ సంఘటనపై వెంకట దినేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

వడ్డేశ్వరంలో వేసవి విజ్ఞాన శిబిరం

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఐద్వా, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రతినిధి వల్లభాపురపు ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. చిన్నారులకు రంగు పేపర్లతో వివిధ రకాల పువ్వులు, గ్రీటింగ్ కార్డులు, న్యూస్‌పేపర్‌తో టోపీలు తయారు చేయడం, కాగితం ముక్కలను చించి వాటిని దండలాగా తయారు చేయడం నేర్పించారు. వివిధ రకాల పరిమాణాలు కలిగిన తాళ్లను సమానం చేయడం, కర్పూరాన్ని అరచేతిలో మండించడం వంటి వాటి వెనుక ఎటువంటి మ్యాజిక్ కానీ, మంత్రాలు కానీ లేవని వివరించారు. ప్రతి విద్యార్థి చిన్నప్పటి నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండాలని, నమ్మకాలకు, మూఢ నమ్మకాలకు మధ్య తేడాను తెలుసుకుని మంచి పౌరులుగా ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక తుళ్లూరు ప్రధాన కార్యదర్శి పి.అరుణ్‌కుమార్, జిల్లా నాయకులు ఆదినారాయణ, సభ్యులు శ్రీనివాసకుమారి, అమలశ్రీ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



తయారుచేసిన పేపర్ టోపీలు, పేపర్‌తో చేసిన పువ్వులను ప్రదర్శిస్తున్న చిన్నారులు

గాయపడిన వ్యక్తికి ఆర్థిక సాయం

మంగళగిరి: విద్యుత్ లైన్లకు మరమ్మతులు నిర్వహిస్తూ ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న ఎలక్ట్రీషియన్‌కు నగరానికి చెందిన విజయ హెల్త్‌కేర్ ట్రస్ట్, బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూ.20వేల ఆర్థిక సహాయం అందజేశారు. దుగ్గిరాల మండలం మంచికలపూడికి చెందిన మణికంఠ పొలంలో మరమ్మతులు నిర్వహిస్తూ ప్రమాదానికి గురయ్యాడు. శరీరం కాలి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సమాచారం అందుకున్న విజయ హెల్త్ కేర్ ట్రస్ట్, బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రూ.20వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఫౌండర్ కాగితాల స్వాతి, బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఉడతా శ్రీనివాస్, ఆలా శివాజీ, తిరువీధుల కిరణ్, మాదు నాగదుర్గ, మధు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఎలక్ట్రీషియన్ మణికంఠకు ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ సేవలు

పాత గుంటూరు: పేద, మధ్య తరగతి కిడ్నీ బాధిత రోగులకు అధునాతన డయాలసిస్ సేవలు అందించడమే లక్ష్యంగా రోటరీ, రెడ్ క్రాస్ సంయుక్తంగా సెయింట్ జోసెఫ్ హాస్పిటల్‌లో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు రోటరీ క్లబ్ గవర్నర్ తెల రాజశేఖరరెడ్డి తెలిపారు. ఆదివారం హాస్పిటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుంటూరు, పరిసర జిల్లాల కిడ్నీ వ్యాధిగ్రస్తులు డయాలసిస్ సెంటర్‌లో అందిస్తున్న సేవల్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ పి. రామచంద్రరాజు మాట్లాడుతూ అతి తక్కువ ఖర్చుతో అధునాతన కిడ్నీ డయాలసిస్ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా



వడ్డేశ్వరం ఎస్సీ కాలనీలో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరు

తాడేపల్లిరూరల్: ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరంలో బకింగ్‌హామ్ కెనాల్ ఒడ్డున ఉన్న విద్యుత్ మోటార్ల నుంచి తాగునీరు సరఫరా కాకపోవడంతో ఆదివారం సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది పర్యవేక్షణలో వాటర్ ట్యాంక్‌ల ద్వారా పలు ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేశారు. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ సతీష్ మాట్లాడుతూ బకింగ్‌హామ్ కెనాల్‌లో సాగునీరు లేకపోవడంతో భూగర్భజలాలు అడుగంటి బకింగ్‌హామ్ కెనాల్ ఒడ్డున ఏర్పాటు చేసిన విద్యుత్ మోటర్ల నుంచి తాగునీరు అందడం లేదని, నగర పాలక సంస్థ అధికారులకు సమాచారం ఇవ్వగా రెండు తాగునీటి ట్యాంకర్లు ఏర్పాటు చేసి ఇందిరా కాలనీ, ఎస్సీ కాలనీలకు తాగునీరు సరఫరా చేసినట్లు ఆయన తెలిపారు.

మంగళగిరి టికెట్ బీసీలకు కేటాయించాలి

బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు సొంటి నాగరాజు

తాడేపల్లిరూరల్: మంగళగిరి అసెంబ్లీ టికెట్ అన్ని రాజకీయ పార్టీలు బీసీలకే కేటాయించాలని రాష్ట్ర బీసీ సేన అధ్యక్షుడు సొంటి నాగరాజు అన్నారు. తాడేపల్లి బైపాస్ రోడ్డులో ఉన్న బీసీ సేన రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంగళగిరి నియోజకవర్గంలో గ్రామస్థాయి నుంచి బీసీ ప్రాతినిధ్యం తగ్గిందని అన్నారు. మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ ఏర్పాటుచేసినా ఎన్నికలు నిర్వహించకుండా కుటిల రాజకీయం చేశారని విమర్శించారు. మంగళగిరి నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెందలేదని అన్నారు. రానున్న ఎన్నికల్లో అన్ని రాజకీయపార్టీలు బీసీ అభ్యర్థులను నిలబెట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో నియోజకవర్గంలో బీసీలను ఏకం చేసి రాజకీయపార్టీల వ్యూహాలను తిప్పి కొడతామని అన్నారు. మంగళగిరి కార్పొరేషన్ చేయడం వల్ల పేద, మధ్యతరగతి వారిపై పన్నుల భారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో రాష్ట్ర కో ఆర్డినేటర్ పరస రంగనాథ్, పట్టణ యువజన అధ్యక్షుడు ప్రసాద్, తాడేపల్లి పట్టణ యువజన అధ్యక్షుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.